తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు : కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. రాజేంద్రనగర్ సమీపంలోని టోల్ సిబ్బందిపై రెచ్చిపోయిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అంటూ ఓ చానల్‌లో ప్రసారమైన వార్తపై ఆయన స్పందించారు. రాజేంద్రనగర్ ఎగ్జిట్ నంబర్ 17 వద్ద టోల్ సిబ్బందిపై జరిగిన దాడికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తప్పుడు సమాచారం ప్రచారం చేసిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం

అంగన్‌వాడీ సేవలు భేష్

కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం కితాబు

మహేశ్వరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం సభ్యులు డాక్టర్ ప్రీతం, యశ్వంత్, అనితారామచంద్రన్ కితాబు ఇచ్చారు. గురువారం మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలో అంగన్‌వాడీ కేంద్రాలను వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహారం, చదువు, ఆటపాటల గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు అభినందనీయమని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇవి అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర్, సీడీపీవోలు శాంతిశ్రీ, షబానా, శ్వేత, హెచ్‌వోడీ అధికారులు సునీత, రవినాయక్, హర్షిత పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఇంద్రానగర్ కాలనీలో గురువారం హిమోఫీలియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.విజయలక్ష్మి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిమోఫీలియా నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది నినాదాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు. చించోడ్ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డాక్టర్ జగదీష్, డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు గ్రేడింగ్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. 12 అంశాలకు సంబంధించి వంద మార్కులను కేటాయిస్తూ.. పని తీరు ఆధారంగా గ్రేడింగ్ ఇస్తున్నారు. రుణ మంజూరులో గ్రేడ్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అధికారులు కూడా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ క్రమం తప్పకుండా సమావేశాలు, పొదుపు పుస్తకాల నిర్వహణ, సభ్యుల హాజరును పర్యవేక్షిస్తూ సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు.



పొదుపు అంశాలను చర్చిస్తున్న మహిళలు (ఫైల్)

- పని తీరు ఆధారంగా మార్కులు
- రుణ మంజూరులో ప్రాధాన్యం
- సంఘాలపై పెరిగిన అధికారుల పర్యవేక్షణ
- జిల్లాలో 'ఏ' గ్రేడ్‌లో 15,074 సంఘాలు

సాధికారతే లక్ష్యంగా!

జిల్లా మహిళా సమాఖ్య	01
మండల మహిళా సమాఖ్యలు	21
గ్రామ మహిళా సంఘాలు	788
స్వయం సహాయక సంఘాలు	19,209
మొత్తం సభ్యుల సంఖ్య	2,06,116

మహిళా స్వయం సహాయక సంఘాలకు గ్రేడింగ్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాలు మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ పథకాలను ఆయా మహిళా సంఘాలకు అందజేస్తోంది. మహిళలకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధికి బాటలు వేస్తోంది. సంఘాల్లో సభ్యులు అనుభవమున్న రంగాల్లో రాణించేలా ప్రత్యేక రుణాలు మంజూరు చేస్తున్నారు. అందుకే మహిళా సంఘాల్లో చాలామంది సభ్యులుగా చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకుతో పాటు స్త్రీ నిధి రుణాలు సైతం అందుతుండటంతో ఆర్థిక సమస్యలను అధిగమించే దిశగా మహిళా సంఘాల

మిగతా 6వ పేజీలో...

పొదుపు సంఘాలపై ప్రత్యేక దృష్టి



మహిళా సంఘాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. క్రమం తప్పకుండా సమావేశాలు, పొదుపు పుస్తకాల నిర్వహణ, సభ్యుల హాజరు వంటివి ప్రామాణికంగా తీసుకుంటున్నాం. సంఘాల పనితీరును బట్టి 12 అంశాల్లో వచ్చిన మార్కుల ఆధారంగా గ్రేడ్‌లు కేటాయిస్తాం. మహిళా సంఘాల్లో గ్రేడింగ్ విధానం అమలు చేయడంతో పొదుపు సంఘాలపై పర్యవేక్షణ పెరుగుతోంది. సమావేశాల లైవ్ ఫొటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు సంఘాల వారీగా నివేదికలను తీసుకొని సమీక్ష చేస్తున్నారు.

శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఏవో

వానాకాలం సాగుకు ప్రణాళిక సిద్ధం

» డీఏవో నర్సింహారావు

ఆమనగల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం పంటల సాగుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసినట్లు డీఏవో నర్సింహారావు తెలిపారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం ఆమనగల్లులోని ఎరువులు, విత్తనాల దుకాణాలను డీఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి ఆధీకృత డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. విక్రయించిన ఎరువులు, విత్తనాలకు రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని డీఏవో హెచ్చరించారు. జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్ గౌడ్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీలో రసాభాస

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం

5

'భూ భారతి'తో రైతులకు మేలు

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- త్వరలోనే ఆధార్ తరహాలో భూధార్
- మే 1 నుంచి గ్రామ పాలన అధికారుల నియామకం
- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం-2025తో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. భూవివాదాలకు తావులేకుండా రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం కొన్ని కొత్త అంశాలను పొందుపర్చుతూ నూతన భూ ఆర్ఓఆర్ చట్టాన్ని తెచ్చిందని చెప్పారు. ఈ మేరకు గురువారం షాద్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో 23 సెక్షన్లతో పాటు, 18 నిబంధనలు ఉన్నాయని వివరించారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూ సర్వే చేసి కొలతలు, హద్దుల సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పులు సవరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు విధిగా భూ సర్వే చేయించి దాని ఆధారంగా మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని చెప్పారు. భూ భారతి చట్టం ద్వారా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా భూముల వివాదం పరిష్కరించడం సులువవుతుందన్నారు. అలాగే వారసత్వ భూముల మ్యుటేషన్‌ను

మిగతా 6వ పేజీలో...

అన్నదాతలకు అండగా కాంగ్రెస్ సర్కార్

- భూ భారతి చట్టంతో ధరణి కలెక్షన్ కింగ్‌లకు చెక్
- షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

6

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

శంషాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గడప గడపకూ జైభీం, జైబాపు, జై సంవిధాన్ నినాదాన్ని చేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. శంషాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా సంపత్‌కుమార్, విశిష్ట అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను శుభ్రపర్చాలన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, వినోద్‌కుమార్, రాచమల్ల సిద్దేశ్వర్, జే.నరేందర్, సదాలక్ష్మి, సంజయ్‌యాదవ్, ఆర్. గణేశ్‌గుప్తా, దూడల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



పాదయాత్రలో డప్పు కొడుతున్న గుమ్మడి వెన్నెల, ఎమ్మెల్యే కసిరెడి

రాజ్యాంగ పరిరక్షణకు ఏకమవుదాం

- » బీజేపీ మనువాద విధానాన్ని ప్రజలు తిప్పి కొట్టాలి
- » తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల

ఆమనగల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, దాన్ని పరిరక్షించుకోవడానికి దేశ ప్రజలంతా ఏకం కావాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుమ్మడి వెన్నెల పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని, మహనీయులను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని ఆమె మండిపడ్డారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్, గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ నేతలు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెన్నెల మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం కంటే మనుధర్మ శాస్త్రానే ముందుకు తీసుకుపోతుందన్నారు. మతతత్వ విధానాలతో బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని మండిపడ్డారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా కులగణన చేయాలన్నారు. గద్దర్ తన జీవితాంతం పేదల కోసం పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధి, పేదల శ్రేయస్సు కోసం దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతన ర్సింహ్మ, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, జక్కు అనంతరెడ్డి, జగన్, మానయ్య, నిట్ట నారాయణ, విజయ్, రాజశేఖర్, కృష్ణనాయక్, కొండయ్య, శేఖర్‌గౌడ్, అంజన్‌రెడ్డి, ప్రసాద్, రామకృష్ణ, ఫరీద్, అలీం, శ్రీకాంత్, మహేశ్, నాజర్, మైసయ్య మల్లయ్య, ఖాదర్ ఖాద్రీ, షాబొద్దీన్ పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేద్దాం

» ఉమ్మడి రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రానున్న రోజుల్లో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి. నర్సింలు, మాజీ డైరెక్టర్లు గోనే కరుణాకర్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, నాయకులు పాండు, మాధవరెడ్డి, మాణిక్యరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేరిరాజు, భాస్కర్, వెంకటేశ్, దేశమొళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

» టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మోదీ పాలన కొనసాగుతుందని, సామాజిక న్యాయమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తలపెట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కోళ్లపడకల్, పోరండ్ల, గాంధీనగర్ తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు మునుపెన్నడూ లేని విధంగా అమలవుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్‌షాతో సహా పలువురు బీజేపీ నేతలు అంతర్గత దాడి చేస్తూ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారన్నారు. బీజేపీ తీరుపై కాంగ్రెస్ అధినాయకత్వం దేశ వ్యాప్తంగా ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టి సీఎం రేవంత్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గాంధీజీని దేశం మరిచిపోయేలా కాషాయం పార్టీ కుట్రలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, కాకి ఈశ్వర్, అల్లెకుమార్, యాదయ్య, ఎన్. రాజునాయక్, లాజర్, సుభాష్, ప్రవీణ్, నవీన్, రాజు, దర్శన్, మల్లేష్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు

నీటిఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోలు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్ అధికారులు, మండలాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. అవసరం మేరకు పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. జిన్‌గుర్తిలో శ్రీరాముల వారి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎస్‌డీఎఫ్ పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు 60రోజుల పాటు పల్లెబాట ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావును పోచారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ నాయకుడు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 20న పోచారంలో జరిగే పోచమ్మ, ఎల్లమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేడ్చల్ మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్, రమేష్ తదితరులున్నారు.


ఎమ్మెల్యే హరీశ్‌రావుతో జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు

చీలాపూర్ సర్వేపై నివేదికకు మంత్రి ఆదేశం

● ఆంధ్రజ్యోతి కథనానికి పొంగులేటి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి/పూడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): "చీలాపూర్‌లో పంట భూముల సర్వే ఎందుకు చేయడం లేదు? ఆ భూముల వివరాలపై నివేదిక ఇవ్వండి." అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆదేశించారు. తాను సీసీఎల్‌ఏ అధికారులతో మాట్లాడి చీలాపూర్‌లో భూముల సర్వే సమస్యను పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'చీలాపూర్‌లో నో సర్వే... 40ఏళ్లుగా కొలతలకు నోచని భూములు' శీర్షికన ప్రచురితమైన కథనంతో మంత్రి స్పందించారు. పరిగి, పూడూరు పర్యటనకొచ్చిన మంత్రికి కథనంలో వచ్చిన అంశాలపై ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, చీలాపూర్ వాసులు వివరించారు. మంత్రి ఆంధ్రజ్యోతి కథనాన్ని పూర్తిగా చదివారు. రెవెన్యూ భూముల సర్వేకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, భూముల రికార్డులన్నీ ఆన్‌లైన్ చేయించేందుకు ఆదేశిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

కంకల్‌ను మండల కేంద్రం చేయాలి

● రెవెన్యూ మంత్రి పొంగులేటికి గ్రామస్తుల వినతి



పూడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కంకల్ గ్రామాన్ని మండల కేంద్రంగా గుర్తించాలని గ్రామస్తులు, రైతులు గురువారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. పూడూరులో భూ భారతి ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామాన్ని మండలం చేసి రైతు రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులురాజు, సీనియర్ నాయకులు శేఖర్, మనోహర్‌గౌడ్, శివరాజ్, అంజయ్య, నర్సింహులు, నిఖిల్ తదితరలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి

కీసర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కీసరలోని కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు కోసం అడవి నరికివేత

● అటవీ శాఖ అధికారుల సీరియస్

బషీరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పు పనుల కోసం మైల్వార్ రిజర్వ్ ఫారెస్టులో కిలోమీటరు మేర యంత్రాలతో చెట్లను ధ్వంసం చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలం జుంటుపల్లి ఆలయ కమాన్ నుంచి బండమీదిపల్లి, పగిడిపల్లి, కొడంగల్ మండలం నాగరం, రుద్రారం మీదుగా బషీరాబాద్ మండలం నీళ్లపల్లి నుంచి మైల్వార్ వరకు డబుల్ రోడ్డు పనులకు రూ.55కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ రోడ్డు వెడల్పు కోసంమూడు రోజుల కిందట రక్షిత అటవీ ప్రాంతలో రోడ్డు పక్కన ఎక్స్‌కవేటర్లతో చదను చేశారు. నీళ్లపల్లి ఏకాంబర ఆలయ కమాన్ సమీపం నుంచి మైల్వార్ రోడ్డు పక్కన అటవీ భూమిలో కందకాలపై పెంచిన నీలగిరి, గచ్చకయ, కానుగ, వేప తదితర చెట్లను తొలగించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ అధికారి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప అక్కడికి చేరుకొని రోడ్డు పనులను అడ్డుకున్నారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి యంత్రాలను అక్కడినుంచి పంపించారు. ఈ విషయమై ఫారెస్టు సెక్షన్ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. చెట్ల ధ్వంసం వాస్తవమేనని, దీనిపై తాండూరు రేంజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఫారెస్టు భూమిలో అనుమతి లేకుండా చెట్లను ధ్వంసం చేసిన వారిపై ఉన్నతాధికారుల అదేశానుసారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రిజర్వ్ ఫారెస్టులో కిలోమీటరు మేర సుమారు 150 నుంచి 200 వరకు చిన్న, పెద్ద చెట్లు తొలగించినట్టు తెలుస్తోంది.


మైల్వార్ ఫారెస్ట్‌లో ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న రోడ్డు పనులు


ధ్వంసమైన చెట్లు

తాండూరు జిల్లాస్పత్రిలో రక్తదాన శిబిరం

తాండూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు లేకపోవడంతో గురువారం జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దర్శిది రవి శంకర్ చొరవతో ఆస్పత్రి సిబ్బంది ముందుకొచ్చి రక్తదారం చేశారు. ఎవరైనా ప్రమాదానికి గురైనా, పేషెంట్లకు రక్తం అవసరం ఏర్పడితే దాతల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. రక్తనిధి కేంద్ర సిబ్బంది ప్రవీణ్, బీరప్ప, విజయ్, అనంతయ్య, దశరత్, శివరాథోడ్, రవీందర్, అస్లా మొద్దీన్, అంజప్ప, మంజుల, శ్రీకాంత్, శ్రీనివాస్ రక్తదానం చేశారు.


రక్తదానం చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

శరవేగంగా బునాదిగాని కాలువ భూసర్వే


బునాదిగాని కాలువ భూసర్వే చేస్తున్న అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లోని మక్త అనంతారం నుంచి అడ్డగూడురు వరకు చేపట్టనున్న బునాదిగాని కాలువ భూసర్వే పనుల్లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమగ్నమయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధిలో రెండు కిలోమీటర్ల వర కు కాలువ ఉంది. ఇందుకు అధికారులు 30ఎకరాల వరకు భూసేకరణ కోసం సర్వే నిర్వహించారు. కాలువ వెడల్పులో 42మీటర్ల వరకు సర్వే చేపట్టారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూసర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ వినయ్ తెలిపారు. ఈ కాలువ వినియోగంలోకొస్తే సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అర్‌ఐ కావ్యారెడ్డి, ఇరిగేషన్ ఏఈ భరత్‌కుమార్, రైతులు శ్రీశైలంయాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల విధేయతతో ఉండాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు రాజ్యాంగం పట్ల విధేయుతతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ మాజీ కార్యనిర్వాహక జడ్జి ప్రకాశ్‌రావు అన్నారు. మండలం పరిధి దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ వర్సిటీలో మూడు రోజుల పాటు ఇక్ఫాయ్ కాన్ఫరెన్స్ ఆఫ్ నేషన్స్(ఐకాన్)-2025 నిర్వహించిన సమ్మిట్ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌రావు ముఖ్య అతిథిగా వచ్చారు. అంతర్జాతీయ సహకారం, న్యాయ పరిజ్ఞానం, మానవీయ సిద్ధాంతాలు, మేథో వినిమయం, కుటుంబ త్యాగాలు, శాంతి తదిరాంశాలపై చర్చించారు. రైటర్డ్ జడ్జి మాట్లాడుతూ... విద్యార్థులు ఎల్లవేళలా న్యాయం వైపే ఉండాలన్నారు. మానవీయ విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఇక్ఫాయ్ వీసీ గణేశ్, లా స్కూల్ డైరెక్టర్ రవిశేఖరరాజు మాట్లాడుతూ.. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలిగానీ గొడవలకు దిగొద్దని సూచించారు. ఇలాంటి వేదికలు విద్యార్థుల జీవితంలో రాణించేందుకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ డీన్ అరుణ్, ఐకాన్-2025 కోఆర్డినేటర్ శ్రీదేవి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జస్టిస్ ప్రకాశ్‌రావు

వైభవంగా భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

తాండూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):చెంపలకు శూలాలు, నడుముకు కొక్కాలతో గుచ్చుకొని నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ దృశ్యాలు బుధవారం రాత్రి తాండూరులో కొనసాగుతున్న భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో కన్పించాయి. మూడు రోజులుగా భద్రేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కర్ణాటక కళాకారులు విన్యాసాలతో ఆకట్టుకుంటున్నారు. ఆలయ రెన్యూవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు, ఈవో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పల్లకిలో స్వామి వారి ఉత్సవమూర్తిని ఉంచి మేళాతాళాలు మధ్య ఊరేగించారు. గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. భద్రేశ్వర ఆలయం నుంచి గంజ్ ఏరియా వరకు పల్లకిసేవ కొనసాగింది. కార్యక్రమంలో వీరశైవ సమాజం, యువదళ్, అక్కాదేవి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


శూలం గుచ్చుకున్న కళాకారుడు


నృత్యం చేస్తున్న కళాకారులు

ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట


ఉపాధి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాల సమీపంలోని ఫోర్త్ సిటీ, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కడ్తాలలో గాన్గుమర్ల తండాకు చెందిన రాజు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహతో కలిసి ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, సేవాలాల్‌సేన రాష్ట్ర కార్యదర్శి లక్‌పతినాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీక్యానాయక్, రామునాయక్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ, హన్మ, మోత్యా, రాజు, రతన్ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు చర్యలు : ఎంపీ

ఆమనగల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్ద పీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. తమిళనాడు రాజధాని చెన్నైలో జరుగుతున్న పరిశ్రమల స్టాండింగ్ కమిటీ సమావేశానికి గురువారం రవి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని యంగ్ ఇండియా స్కిల్ స్కిల్ డెవలప్‌మెంట్ కింద పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవాలని స్టాండింగ్ కమిటీ సభ్యులకు ఆయన వినతి పత్రం ఇచ్చారు. లోక్‌సభ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తామని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రవి

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

దౌల్తాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ అన్నారు. దౌల్తాబాద్‌లో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్, తహసీల్దార్ గాయత్రి, మాజీ ఎంపీటీసీ మంజుల దస్తప్ప, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్ రెడ్డి

అభివృద్ధిలో అధమం..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అభివృద్ధి సూచీలో కొన్ని పంచాయతీలు కనీస స్థాయిల్లో అయినా వసతులు కల్పించక స్కోరింగ్‌లో చివరి స్థానాల్లో నిలిచాయి. పారిశుధ్యం, పచ్చదనం, మహిళలకు ఆర్థిక తోడ్పాటు, అంగన్‌వాడీ, స్కూళ్ల నిర్వహణ తదితర తొమ్మిది అంశాల్లో ఆ గ్రామాలు కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదు. మేడ్చల్ జిల్లా నర్సంపల్లి, గోధుమకుంట, కోనాయిపల్లి, లింగాపూర్ తండా గ్రామాలు అత్యల్ప అభివృద్ధిలో అధమ స్థానాల్లో ఉన్నాయి.

సర్పంచ్ ఏకగ్రీవం.. పురోగతి శూన్యం
కనీస వసతులకు నోచని నర్సంపల్లి


గ్రామంలో ఇళ్ల మధ్య పేరుకున్న చెత్త

కీసర, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గతంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవమై ఆదర్శంగా నిలిచిన మేడ్చల్ జిల్లా నర్సంపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. కేంద్ర పంచాయతీరాజ్ అభివృద్ధి సూచిలో 63.51 స్కోరింగ్‌తో గ్రామం జిల్లాలో నాలుగో స్థానంలో ఉంది. కొన్నేళ్ల కిందటి వరకు ఈ గ్రామం యాద్గార్‌పల్లి పంచాయతీలో విలీనంగా ఉండేది. కేసీఆర్ ప్రభుత్వంలో కొత్త పంచాయతీగా ఏర్పడింది. గ్రామస్తులంతా సామల సత్తెమ్మను మొదటి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అయితే ఆమె గ్రామానికి నిధులు తేవడంలో విఫలమయ్యారు. పంచాయతీకి ఏకగ్రీవ నజరానా కూడా అందలేదు. దీంతో సర్పంచ్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామ ప్రజలకు మౌలిక వసతులు లేవు. మంచినీటి సరఫరా సరిగ్గా నిర్వహించలేదు. హరితహారం, ఎరువు కంపోస్ట్ తయారు చేయలేదు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించలేదు. ఆర్థిక వృద్ధిలో మహిళలకు అంతగా ప్రోత్సాహమేదీ పంచాయతీ తరపున కల్పించలేదు. అంగన్‌వాడీ నిర్వహణా అంతంతే. దేనిలో చూసినా నర్సంపల్లి వెనబడింది. దీనికి తోడు పంచాయతీ కార్యదర్శులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. వెరసి కేంద్ర ప్రభుత్వ స్కోరింగ్‌లో 63.51శాతంతో జిల్లాలో చివరి నాలుగో స్థానంలో నిలిచింది.

వసతుల్లో లింగాపూర్ తండా

వెలగని వీధి దీపాలు ● నర్సరీలో ఎండిన మొక్కలు

మూడుచింతలపల్లి: మండలంలోని లింగాపూర్‌తండా గురించి పట్టించుకునే వారు లేరు. గ్రామ అభివృద్ధి లేదు. లింగాపూర్ తండాను మాజీ సీఎం కేసీఆర్ దత్తత తీసుకొని పంచాయితీగా ఏర్పాటు చేశారు. నిధులు మంజూరు చేసినా అభివృద్ధి పెద్దగా జరగలేదు. తండా జనాభా తక్కువే ఉంది. డెవెలప్‌మెంట్ ఇండెక్స్‌లో 60శాతం స్కోర్ సాధించి చివరన నిలిచింది.

రాత్రిపూట అంధకారమే ...

లింగాపూర్ తండాలో వీధి దీపాలు వెలగవు. రాత్రి అంధకారం నెలకొంటోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా నిధుల్లేవని పట్టించుకోవడం లేదని తండా వాసులు చెబుతున్నారు. ఎవరికైనా జబ్బుచేస్తే మూడుచింతలపల్లికి వెళ్లి చూపించుకోవాలి. ప్రైవేట్ మందుల దుకాణం కూడా లేదు. తండాలోని నర్సరీలో మొక్కలు పెంచలేదు. ఉన్న కొద్దిపాటి మొక్కలకూ నీరుపోయక ఎండిపోయాయి.


లింగాపూర్‌తండా నర్సరీలో మొక్కలు లేని నర్సరీ

ఈ గ్రామంలో హరితహారం నామమాత్రగా అయినా అమలుకాలేదు. ఎక్కడా కొత్తగా నాటిన మొక్కలు పెరిగిన దాఖలాల్లేవు.



సమన్వయ లోపం... ఊరుకి శాపం

» ప్రగతిలో గోధుమకుంట వెనకడుగు

కీసర, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల మధ్య సమన్వయం లేక ఆ ఊరు అభివృద్ధిలో కుంటుపడింది. కేంద్ర ప్రభుత్వం 2022-23లో కేంద్ర పంచాయతీ రాజ్ సుపరిపాలన తొమ్మిది అంశాల్లో పురోగతి లేనదని మేడ్చల్ జిల్లా గోధుమకుంటకు అధమ స్థానాన్ని ఇచ్చింది. బాగా అభివృద్ధి సాధించిన గ్రామాలకు ఉత్తమ స్కోరింగ్ ఇచ్చిన కేంద్రం సాధించని గ్రామాలకు కూడా ఆయా అధమ స్కోర్ ఇచ్చింది. గోధుమకుంట అభివృద్ధికి నోచుకోక జిల్లాలో 63.03 స్కోరింగ్‌తో మూడో స్థానంలో ఉంది. మాజీ సర్పంచ్ ఒకటి తలిస్తే, అక్కడి పంచాయతీ కార్యదర్శులు మరో పనిచేయడం. వారి మధ్య గొడవలు ఇలా పలు కారణాలతో గ్రామంలో పనులు పడకేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమల్లో విఫలమయ్యారు. పారిశుధ్యం, చెత్త సేకరణపై అవగాహన కల్పించలేదు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. చెత్త సేకరణ కేంద్రంలో రెండు కుండీలు కట్టి వాటికి తడి చెత్త అని రాశారు. నిజానికి ఒకటి తడిచెత్త, మరోటి పొడిచెత్త అని రాయాలి. అధికారులు, పర్యవేక్షుల నిర్లక్ష్యానికి ఇదే తార్కాణం. గత పాలకులకు అక్రమ అనుమతులు, అక్రమ వెంచర్లపై ఉన్న శ్రద్ధ గ్రామాభివృద్ధి లేదు. దీంతో గోధుమకుంట చెత్త స్కోరింగ్ మూటగట్టుకుంది.



రెండు కుండీలకు తడి చెత్త అని రాశారిలా..

అస్తవ్యస్తంగా కోనాయిపల్లి

» కొత్త పంచాయతీలో వసతుల లేమి



కోనాయిపల్లి పంచాయతీ కార్యాలయం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హామ్లెట్ గ్రామం నుంచి స్వతంత్ర పంచాయతీగా మారినా గ్రామ అభివృద్ధి మాత్రం శూన్యమే. సర్పంచ్, ఎంపీటీసీ పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నారు తప్ప గ్రామం చెప్పుకోదగ్గ వృద్ధి సాధించలేదు. అభివృద్ధిలో చిట్టచివరి జాబితాలో మేడ్చల్ మండలం కోనాయిపల్లి చేరింది. గతంలో నూతన్‌కల్‌కు అనుబంధంగా ఉన్న కోనాయిపల్లి 2019లో సొంత పంచాయతీగా ఏర్పడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 406మంది జనాభా, 356 మంది ఓటర్లు, ఆరు వార్డులు ఉన్నాయి. నూతన్‌కల్‌కు అనుబంధంగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే ప్రత్యేక పంచాయతీగా సాధించిందేమీ లేదని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఐదేళ్లలో ఈ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేదు. గతంలో నిర్మించిన డ్వాక్రా భవనం, పాఠశాల తప్ప ఎలాంటి పనులు చేపట్ట లేదు. 2023లో రూ.30లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేసినా పనులు చేయలేదు. గ్రామానికున్న 30ఫీట్ల రోడ్డు కంకర తేలి గుంతలమయమైంది. గ్రామంలో అధికారుల పాలనలో సమస్యలు తాండవిస్తున్నాయి. సమస్యలపై పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. నల్లా నీరు రావడం లేదని, ఇళ్లలో జమయ్యే చెత్త సేకరించే వారు లేదని, మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానికులు అంటున్నారు. గ్రామంలో సమస్యను పట్టించుకునే వాడు లేడు. దోమలతో వేగలేకపోతున్నాం. నీళ్లు కూడా సరిగా వొస్తలేవు అని వృద్ధురాళ్లు పోశమ్మ, యాదమ్మ ఆవేదనను వ్యక్తం చేశారు.


గుంతలమయంగా రోడ్డు

వసతులకు నోచుకోని అద్రాస్‌పల్లి

● వేధిస్తున్న పారిశుధ్య లోపం

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామం అభివృద్ధితో వెనక వరసలో ఉంది. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీటి పారకంతో దోమల స్వైర విహారం చేస్తున్నాయి. దోమకాటుతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. పారిశుధ్యంపై ఎవరూ దృష్టిపెట్టడం లేదు. రోడ్లపై చెత్త పేరుకుంది. అద్రాస్‌పల్లిలో 1,900మంది జనాభా ఉంది. 1,820 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ పనితీరు సరిగ్గా లేక కేంద్ర సర్వేలో 62శాతం స్కోర్‌తో చివరి వరసలో నిలిచింది. అద్రాస్‌పల్లి, ఎల్లగూడ ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారు. ఎక్కువగా కూరగాయల సాగుచేస్తూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గ్రామ రోడ్లు సరిగ్గా లేక ధాన్యం, కూరగాయల రవాణాకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మంత్రి మల్లారెడ్డి ఎల్లగూడలో సీసీ రోడ్లకు, అద్రాస్‌పల్లి పంచాయతీ నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలేశారు. మహిళా సంఘం భవనాన్నే పంచాయతీగా వినియోగిస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధుల్లేక ఎక్కడి సమస్యలక్కడే ఉన్నాయి. గ్రామంలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


శిథిలావస్థలో అద్రాస్‌పల్లి పంచాయతీ కార్యాలయం



రోడ్డు పక్కన పారబోసిన చెత్త


అంగన్‌వాడీ సెంటర్ పరిసరాలను పరిశీలిస్తున్న రాధికాగుప్తా

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అలాగే క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఉదయం శామీర్‌పేట గ్రామంలోని 1వ, 4వ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. శిథిలావస్థ లో ఉన్న 4వ అంగన్‌వాడీ కేంద్రం భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న పప్పు, పాలు, గుడ్లు పౌష్టికాహారాన్ని పరిశీలించారు. క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులను నేర్పించాలని టీచర్లకు సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి గదులను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఏఎస్ సీడీపీవో శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ ఇంజనీర్ సునీత తదితరులు ఉన్నారు.

మత విద్వేషాలను రేపుతున్న బీజేపీ


జై సంవిధాన్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అహింసాయుతంగా స్వాతంత్ర్య పోరాటం చేసి విజయం సాధించిన దేశంలో నేడు బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. గురువారం ముచ్చర్ల, ఉట్లపల్లి, వావిళ్లకుంట తండా, బ్యాగరికంచ గ్రామాల్లో నిర్వహించిన జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మ న పైనే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, సురేందర్, యుగేందర్‌గౌడ్,సులేమాన్, అంజు, పాండు, నర్సింహ, జగన్, బి.పాండురంగారెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

● సబ్‌స్టేషన్ వద్ద మృతుడి కుటుంబీకుల ధర్నా


అశోక్‌రెడ్డి(ఫైల్)

చౌదరిగూడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్లలో ఓ రైతు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలం మోదళ్లగూడ వాసి అశోక్‌రెడ్డి(35).. చిన్న ఎల్కిచర్లలో పొలం కౌలుకు సాగుచేస్తున్నాడు. ఆయన భార్య అక్షయ, ఇద్దరు కుమారులతో పర్వతాపూర్‌లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం పొలం వద్ద విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇదే విషయం ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్, లైన్‌మన్ చిన్నరెడ్డిలకు చెప్పినా పట్టించుకోలేదు. వైర్లు, స్తంభాలను పక్కన వేసే ప్రయత్నంలో షాక్‌తో అశోక్‌రెడ్డి చనిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహంతో సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. షాద్‌నగర్ ఇన్‌చార్జీ ఏసీపీ హుస్సేన్‌నాయుడు, రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐ రవీందర్ నాయక్, చౌదరిగూడ ఎస్ఐ విజయ్.. చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే అశోక్‌రెడ్డి చనిపోయాడని ఆయన కుటుంబీలన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ విషయమై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెక్కుల పంపిణీలో రసాభాస

» కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు మంజూరు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గురువారం కందుకూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మధ్య వాగ్వాదంతో రసాభాసగా మారింది. ఎమ్మెల్యే సబితారెడ్డి కలుగజేసుకోవడంతో ఇరువర్గాలు శాంతించాయి. మండల పరిషత్‌లో తహసీల్దార్ కె.గోపాల్ ఆధ్వర్యంలో 105మందికి చెక్కుల పంపిణీ ప్రారంభించారు. మొదట ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇవ్వాలని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. పరిశ్రమలకు ఇప్పటికే సేకరించిన 14వేల ఎకరాలుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం తిమ్మాపురం, తిమ్మాయిపల్లిల్లో మరో 3వేల ఎకరాలను సేకరించడం ఏమిటని సబిత ప్రశ్నించారు. దీంతో ఏఎంసీ డైరెక్టర్ అండెకార్ సురేందర్ లేచి.. బీఆర్ఎస్ హామీ ఇచ్చినట్టు పేద దళితులందరికీ 3ఎకరాలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులంతా లేచి ఎమ్మెల్యే మాట్లాడుతుండగా మీరెందుకు మాట్లాడుతారని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగాయి. దీంతో ఎమ్మెల్యే వేదిక నుంచి కిందికి దిగి బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపించారు. కాంగ్రెస్ నాయకులు సైతం బయటకు వెళ్లారు. అనంతరం చెక్కుల పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ పాటిస్తే గందరగోళం ఉండదని అధికారులన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, ఎంపీడీవో సరిత, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, ఆనంద్, పాండు, యుగేందర్‌గౌడ్, డీటీ శేఖర్, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దశరథ్, ఇందిరదేవేందర్, రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, అష్ఫల్‌బేగ్, తిరపతయ్య, ప్రకాశ్‌రెడ్డి, కార్తీక్, వెంకటేష్, శేఖర్, దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.


నానక్‌నగర్‌లో ఫెన్సింగ్ రాడ్లను పాతుతున్న కూలీలు

జోరుగా సర్వే, ఫెన్సింగ్ పనులు

యాచారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫార్మాసిటీకి సేకరించిన భూములకు హద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ కోసం ఇనుప రాడ్లు పాతే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. గురువారం వరకు 25కిలోమీటర్ల వరకు సర్వే చేశారు. మొత్తం 125 కిలోమీటర్ల సర్వే హద్దులు పాతాల్సి ఉందని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. తాటిపర్తిలో నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తామని, ఆందోళన చెందొద్దని అన్నారు. తాటిపర్తి బంధం చెరువు, కుర్మిద్ద పెద్దచెరువులోకి రాకపోకలకు రోడ్డు దారి వదలాలని రైతులు, మత్స్యకారులు అధికారులను కోరారు. ఫార్మాసిటీ భూములకు ఫెన్సింగ్ వేసేందుకు తమకు అభ్యంతరం లేదన్నారు. హద్దు పనులను రాచకొండ మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు, తహసీల్దార్ అయ్యప్ప పర్యవేక్షిస్తున్నారు.

సకాలంలో చికిత్స అందించాలి

» డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హిమోఫిలియా వ్యాధి ఒక జన్యు సంబంధమైనదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ పేర్కొన్నారు. గురువారం కొత్తగడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమోఫిలియా జబ్బు ఉన్న వారిలో రక్తం గడ్డకట్టే స్వభావం తక్కువగా ఉంటుందన్నారు. హిమోఫెలియా కేసులను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రస్తుత వేసవి కాలంలో వడదెబ్బ, ఎండ తీవ్రతల నుంచి రక్షణ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిరోషా, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి బుచ్చిబాబు, కొత్తగడి వైద్యాధికారి కృపాలత, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, మహేష్ రేణుకుమార్, జయరాముడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి


ధ్వంసమైన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లిలో గాలివానకు నేల కూలిన బొప్పాయి తోటను, రాలిన మామిడికాయలను గురువారం విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. మామిడి రైతు శ్రీనివాస్‌గౌడ్, బొప్పాయి రైతు జంగయ్యలను పరామర్శించారు. నష్టపోయిన పంటలను యంత్రాంగం వెంటనే పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఫసల్ బీమాను అమలు చేస్తే ఇలాంటి వైపరీత్యాల్లో బీమా కంపెనీలే రైతులకు పరిహారం చెల్లించేవన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేయాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యానవన అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, గణేశ్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, భాను, మహేందర్‌రెడ్డి, కె.నరేందర్‌రెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీం బాగలేదని దాడి

దుకాణ యజమానులపై అన్నదమ్ముల దాష్టీకం ● కేసు నమోదు


మచ్చ రాజశేఖర్, విశాల్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీంలు బాగాలేవని ఓ దుకాణదారుడిపై, అతడి భార్యపై దాడి ఘటనలో ఇద్దరు అన్నదమ్ములపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన పప్పూరామ్ కుమావత్, అతడి భార్య శైలు పిల్లలతో కలిసి అవుశాపూర్‌లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం అవుశాపూర్‌నకు చెందిన మచ్చ రాజశేఖర్.. కిరాణ దుకాణానికి వెళ్లి రూ20 ఇచ్చి రెండు ఐస్‌క్రీంలు తీసుకున్నారు. గంట తరువాత వచ్చి రెండు ఐస్‌క్రీంలు కరిగిపోయాయని, నాసికరం ఐస్‌క్రీంలు ఇచ్చారని గొడవపడి వెళ్లిపోయారు. సాయంత్రం మరోసారి రాజశేఖర్, సోదరుడు విశాల్‌తో షాపునకు వొచ్చి పప్పూరామ్, శైలులపై దాడి చేశాడన్నారు. పప్పూరామ్ కూతురికి గాయాలు కాగా, దుకాణంలోని సామగ్రి ధ్వంసమైందన్నారు. శైలు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

హైవేపై పడిన మర్రివృక్షం

చేవెళ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం గాలితో వర్షం పడింది. అయితే భారీ గాలికి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన మిర్జాగూడ-ఖానాపూర్ గేట్‌ల మధ్య ఉన్న మర్రిచెట్టు రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ముప్పు తప్పింది. వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో మర్రిచెట్టును తొలగించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

తలకొండపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గట్టిప్పలపల్లిలో గురువారం మాట్లాడుతూ.. గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్కదాన్నీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రాజు, జంగయ్య, కృష్ణయ్య, రవీందర్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

సాధికారతే లక్ష్యంగా..!

(3వ పేజీ తరువాయి)

సభ్యులు ముందుకు సాగుతున్నారు. ఈ సంఘాలను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగ్ విధానాన్ని సైతం అమలు చేస్తోంది. గ్రేడింగ్ ఆధారంగా రుణాలను ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపుతున్నాయి. ఏ గ్రేడ్ నుంచి ఈ గ్రేడ్ వరకు పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లాలో 21 మహిళా సమాఖ్యలు, 788 గ్రామ మహిళా సంఘాలు, 19,209 స్వయం సహాయక సంఘాలు ఉండగా, మొత్తం 2,06,116 సభ్యులు ఉన్నారు. గ్రేడ్‌ల ఆధారంగా సంఘాలకు రుణాలను అందిస్తున్నారు. మహిళా సంఘాలకు ఒక్కో యూనిట్ విలువను రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిర్ణయించారు. జిల్లాలో 15074 సంఘాలు గ్రేడ్ 'ఏ'లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే 'బి' గ్రేడ్‌లో 388 సంఘాలు, 'సి' గ్రేడ్‌లో 1366 సంఘాలు, 'డి' గ్రేడ్‌లో 1277 సంఘాలు ఉన్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు గుర్తించారు.

అంశాల వారీగా గ్రేడ్లు

మహిళా సంఘాలకు 12 అంశాల ఆధారంగా ఎ,బి,సి,డీ,ఇ గ్రేడింగ్‌లుగా గుర్తిస్తారు.



ఒక్కో సంఘం 75 శాతానికి పైగా లక్ష్యాలను సాధిస్తే ఎక్కువ సంఖ్యలో రుణాలిస్తారు. ఇలా తక్కువ వడ్డీకి ఇచ్చిన రుణాలను వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 75 శాతానికి పైగా లక్ష్యాలను సాధిస్తే ఎ గ్రేడ్, 70 శాతం నుంచి 74 శాతం వరకు బి గ్రేడ్, 60లోపు సాధిస్తే సి గ్రేడ్, 50 శాతం వరకు ఉంటే డి గ్రేడ్, అంతకంటే తక్కువగా ఉంటే ఇ గ్రేడింగ్ ఇస్తారు. ఎ, బి, సి గ్రేడింగ్ సంఘాలకు స్త్రీనిధి రుణాలను కేటాయిస్తారు.

కేటాయించే విధానం

ప్రతీ నెల నిర్వహించే రెండు సమావేశాలకు సభ్యులందరూ హాజరుకావాలి. సక్రమంగా స్త్రీ నిధి రుణ వాయిదాలు చెల్లించాలి. ప్రతి నెలా పొదుపు చెల్లింపులు ఉండాలి. గ్రామ సంఘానికి, బ్యాంకులకు కట్టే రుణ వాయిదాల సకాలంలో చెల్లించాలి. వీటన్నింటికి తగి న మార్కులను కలిపి గ్రేడింగ్ నిర్ణయిస్తారు.

బ్యాంకు రుణాలతో ఊతం

గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. వీటితో పాటు అదనంగా వ్యాపారాలు చేసుకునే మహిళలకు స్త్రీనిధి ద్వారా ప్రత్యేకంగా రుణాలు అందజేస్తున్నారు.

పెరిగిన అధికారుల పర్యవేక్షణ

గ్రేడింగ్ విధానం అమలులోకి రావడంతో మహిళా సంఘాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగింది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలతో కూడిన లైవ్ ఫొటో తప్పనిసరి చేసిన విషయం విదితమే. దీంతో పాటు రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రేడింగ్‌లో వెనుకబడకుండా అధికారులు సంఘాల వారీగా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని వారితో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నిరంతరం చేపడుతున్న ఈ ప్రక్రియ వల్ల మహిళలు మరింత ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసే అవకాశముంటుందని ఆధికారులు భావిస్తున్నారు.

మహిళా సంఘాలకు గ్రేడింగ్ ఇలా

మండలం	గ్రామ సంఘాలు	స్వయం సహాయక సంఘాలు	ఏ గ్రేడ్	బీ గేడ్	సీ గ్రేడ్	డీ గ్రేడ్
అబ్దుల్లాపూర్‌మెట్	33	865	651	44	81	34
ఆమనగల్లు	14	325	241	06	26	26
చేవెళ్ల	58	1,185	937	19	80	113
చౌదరిగూడెం	25	574	489	14	41	23
ఫరూక్‌నగర్	51	1,108	992	14	42	15
ఇబ్రహీంపట్నం	32	904	610	28	71	109
కడ్తాల్	29	758	626	13	74	23
కందుకూరు	56	1,357	1,047	18	78	90
కేశంపేట్	39	926	779	17	78	33
కొందుర్గు	22	525	486	04	14	07
కొత్తూరు	18	391	351	0	30	07
మాడ్గుల్	39	976	738	35	84	56
మహేశ్వరం	42	1,074	889	25	63	81
మంచాల	52	1,191	982	22	74	49
మొయినాబాద్	51	1368	1,104	06	86	60
నందిగామ	28	586	552	01	19	0
షాబాద్	45	1006	629	33	87	130
శంషాబాద్	38	1,121	768	10	114	59
శంకర్‌పల్లి	39	919	555	26	85	159
తలకొండపల్లి	33	930	701	04	74	109
యాచారం	43	1,213	947	49	65	94

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణం చేపట్టారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తోలుకట్ట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 155లో 14 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో నగరానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడి పార్థివదేహం పెట్టి సమాధి నిర్మించారని పేర్కొన్నారు. దీనికి పండిట్ రోహిత్ మహారాజ్ దేవస్థానం అని పేరుపెట్టి అందులోకి ఎవరినీ రాకుండా భారీ గేటు ఏర్పాటు చేశాడని ఆరోపించారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం కావడంతో రాత్రిళ్లు వింత శబ్దాలు వస్తున్నాయని తెలిపారు. అందరూ భయభ్రాంతులకు గురవుతున్నారని, అందులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. తోలుకట్టలో అనేక ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడడమే తమ లక్ష్యమన్నారు. తహసీల్దార్‌ఉ కలిసిన వారిలో శివశంకర్‌గౌడ్, వెంకటయ్య, యాదయ్య, శ్రీకాంత్, విఠలయ్య ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తోలుకట్ట గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులను గుర్తించాలని సూచించారు. ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిచాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇల్లు నిర్మించకుండా బిల్లులు తీసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 20లోగా కమిటీ సభ్యులు అధికారులకు లబ్ధిదారుల లిస్టు ఇవ్వాలన్నారు. అధికారులు ఈ నెల 25 నుంచి 31 వరకు విచారణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ నాయక్, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవోలు హిమబిందు, వెంకయ్య, మున్సిపాల్ కమిషనర్ పూర్ణచందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్లు దేవర వెంకటొరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌డ్డి, చంద్రశేఖర్, నాయకులు కృష్ణారెడ్డి, బండారు ఆగిరెడ్డి, సున్నపు వసంతం, చెన్నయ్య, జనార్దన్ ఉన్నారు.

'భూ భారతి'తో రైతులకు మేలు

(3వ పేజీ తరువాయి)

గడువులో పూర్తి చేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ వ్యవస్థ రైతులకు చట్ట ప్రకారం మార్గం కల్పిస్తుందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించేలా కూడా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేసి, మోసపూరితంగా ప్రభుత్వ భూములపై హక్కులు పొందిన పట్టాలను రద్దు చేసేందుకు ఈ చట్టం అధికారం కల్పిస్తుందన్నారు. మే 1నుంచి గ్రామ పాలన అధికారుల నియామకంతో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కృష్ణారెడ్డి సులోచన, వైస్ ఛైర్మెన్ బాబర్‌ఖాన్, షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ఆర్ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

రైతులకు అండగా కాంగ్రెస్ సర్కార్

కేశంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం 2025తో ధరణి కలెక్షన్ కింగ్‌లకు చెక్ పడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలోని బీవీఎస్ఎైై గార్డెన్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్‌తో అధికారులు ధనవంతులయ్యారే గాని భూ సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ప్రతి రైతు భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్ఆర్ సరిత, తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవాలకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్, తదితరులు

యాచారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్షకార్యదర్శులు రమేశ్‌గౌడ్, భాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం యాచారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామానికి రెండు ప్రత్యేక బస్సులతోపాటు ఇతర వాహనాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మరోజు శ్రీనివాస్‌చారి, తలారి మల్లేష్, సొసైటీ వైస్ ఛైర్మన్ కారింగ్ యాదయ్య, ఓరుగంటి యాదయ్య గౌడ్, శంకర్‌నాయక్, భీమ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను తరలి రావాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 27న నిర్వహించే రజత్సోవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రాజు నాయక్, హన్మంత్‌రెడ్డి, మాణ్యిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తుందని మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శాంతశ్రీ అన్నారు. బండమీదగూడూరులో అమేజాన్ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. గురువారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని అమేజాన్ సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమేజాన్ సంస్థ మేనేజర్లు అవినాష్, చైతన్య, ఇదాయత్, జ్యోషిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, టీచర్లు నిర్మల, రాధిక, విజయ, కల్పన, ప్రసన్న కవిత, నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

ఆమనగల్లు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాదిక అన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక పదర్థాలను ప్రదర్శించారు. పోషక విలువల గురించి అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ అలివేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో శాంతశ్రీ

కొత్తూర్: మండల పరిధిలోని మల్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం గ్రాడ్యువేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పిల్లలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి సర్టిఫికెట్లు అందజేశారు. పౌష్టికాహారంపై గర్భిణులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, పంచాయతీ కార్యదర్శులు రాణి, గీత, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ప్రేమలత, సువర్ణ, నారాయణమ్మ, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్త నవనీత పాల్గొన్నారు.

కేశంపేట: తల్లి పాలతో చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. గురువారం ఎక్లాస్‌ఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, వీరమణి, సునీత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదిభట్ల కమిషనర్

బాలకృష్ణకు పదోన్నతి

ఆదిభట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్-3 హోదాలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఆయన పదోన్నతి పట్ల మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రేపు అవగాహన సదస్సు

ఆమనగల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై ఈనెల 19న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత పేర్కొన్నారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు ఉంటుందని తెలిపారు. సదస్సుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సులో రైతులు, ప్రజలు పాల్గొని భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

ఫ్యాన్లు బహూకరణ

ఆదిభట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆదిభట్లకు చెందిన కొత్తపల్లి మురళి రెండు సిలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ, టీచర్ బేబి మురళిని అంభినందించారు.

బిహార్ సర్పంచ్‌ల పర్యటన

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతూప్రలో బిహార్‌కు చెందిన ఎన్ఐఆర్‌డీ అధికారులు, సర్పంచ్‌ల బృందం గురువారం పర్యటించింది. మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మాశ్రీనివాస్ అధికారులకు, సర్పంచ్‌లకు ఘనంగా స్వాగతం పలికారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

షాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ కోరారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో 11 మంది విద్యార్థులు గురుకుల విద్యాసంస్థలకు ఎంపిక కావడంతో గురువారం గ్రామంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, గ్రామంలో వంద శాతం పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, సంహాద్రి నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మాడ్గుల, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన గుడిగ పెంటయ్య, పల్లేటి జిల్ల మైసయ్య అనారోగ్యంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.3 వేలు బీఆర్ఎస్ యువజన నాయకుడు పాలకూర్ల రాజుగౌడ్ అందచేశారు. కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, చెన్నయ్య, యాదయ్య, కృష్ణ, మహేశ్ పాల్గొన్నారు. అలాగే మాడ్గుల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్కపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల రాములమ్మ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబానికి కార్యకర్తల ద్వారా రూ.3 వేలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన సింగల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి రూ.2 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శివలింగం, శంకర్ గౌడ్, పందుల రాములు, ఏర్పుల మైసయ్య, తోలు వెంటయ్య ఉన్నారు.

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అన్నారం లక్ష్మమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభాకర్‌రెడ్డి సమకూర్చిన రూ.3 వేలు స్థానిక నాయకులు అందజేశారు. నాయకులు చంద్రారెడ్డి, అశోక్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, రామస్వామి గౌడ్, శ్రీనివాస్, జంగయ్య, రాములు, పరమేశ్, వీరేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

షాబాద్ పీహెచ్‌సీకి వైద్య పరికరాల పంపిణీ

షాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెల్సన్ ఫౌండేషన్ ద్వారా వైద్య పరికరాలను గురువారం ఉచితంగా అందజేశారు. వెల్సన్ ఫౌండేషన్ ఫ్లోరింగ్ వైస్ ప్రెసిడెంట్, ఐటీ హెడ్ సుబ్రమణ్యేశ్వరీగుప్తా మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించేందుకు తమవంతుగా వైద్య పరికరాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఆర్‌సీ హెడ్ సురేఖ, డాక్టర్ ప్రభాకర్, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య ఉన్నారు.

కడ్తాల్ సీఐకి సన్మానం

కడ్తాల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కడ్తాల సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను గురువారం ముద్విన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, నర్సింహ, శ్రీశైలం, నరేశ్ గౌడ్ ఉన్నారు.

క్రైం కార్నర్

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ఆదిభట్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పరిధిలోని ఎంపీ పటేల్‌గూడ గ్రామానికి చెందిన జంగం నరేందర్(20) 2018లో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్రైం నంబర్ 103/2018 అండర్ సెక్షన్ 366, (1), 376(1) 3(ఏ)డబ్ల్యూ-4, రెడ్‌విత్ 16,17ల ప్రకారం కేసులు నమోదు చేసి పూర్వాపరాలను కోర్టుకు సమర్పించారు. వివరాలను ఎల్బీనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ న్యాయాధికారి పరిశీలించి నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా, బాలికకు రూ.4లక్షల పరిహారం అందించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటయ్య(ఫైల్)

చేవెళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామానికి వెళ్తున్నానని బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని మక్తాగూడ గ్రామానికి చెందిన బుత్తుల వెంకటయ్య(35) కొంతకాలంగా చేవెళ్లలో ఉంటూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 15న సొంత ఊరు మాక్తగూడకు వెళ్తున్నట్లు ఇంట్లో తన భార్య శ్రీలతకు చెప్పి వెళ్లాడు. అ తర్వాత ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో ఊరికి వెళ్లి ఉంటాడని అనుకుంది. 16న అత్తకు ఫోన్ చేయగా వెంకటయ్య రాలేదని చెప్పడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం శంషాబాద్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన చేతన్‌రెడ్డి(26) తన భార్య బిందును మొయినాబాద్‌లోని భాస్కర లా కాలేజీలో పరీక్ష ఉండడంతో బైకుపై తీసుకెళ్లాడు. పరీక్ష పూర్తయిన తర్వాత తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో పెద్దషాపూర్ గ్రామానికి చెందిన గోనెల యాదయ్య మామిడితోటలో మామిడి పండ్లు తీసుకొని తిరిగి బైకు వద్దకు వస్తుండగా తొట బయటకు వచ్చే క్రమంలో ప్రహరీ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వైరు చేతికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. క్షణల్లో ప్రాణాలు పోయిన భర్తను చూసి భార్య బిందు కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ అన్నారు. గురువారం నుంచి నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో పాడిపశువులకు టీకాల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటిరోజు సురంగల్‌లో 192 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. సిబ్బంది ప్రసన్న కుమార్, భీంరావు, ఫోరమియా పాల్గొన్నారు.

కడ్తాల్: జాతీయ జంతు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు పశువైద్య అధికారి డాక్టర్ భానునాయక్ తెలిపారు. ఈనెల 16 నుంచి మే 15 వరకు టీకాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం భానునాయక్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 11,500 ఆవులు, 500 గేదెలు ఉన్నాయని తెలిపారు.



మొయినాబాద్ రూరల్: సురంగల్‌లో టీకాలు వేస్తున్న డాక్టర్ అహ్మద్

శంకర్‌పల్లి: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని శంకర్‌పల్లి మండల పశువైద్యురాలు శ్రావణి సూచించారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని కాకర్లగుట్టతండా, ఎర్రిగుంట తండా, జన్వాడ తదితర గ్రామాల్లో 121 గేదెలకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు.

చౌదరిగూడ: కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాలలో ఆవులు 120, 40 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరి డాక్టర్ వెంకటేష్ తెలిపారు. కొందుర్గు పశువైద్యశాలను జేడీ బేరిబాబు సందర్శించారు. జిల్లేడ్ చౌదరిగూడకు చెందిన రైతులు శ్రీనివాస్, లక్ష్మయ్య, నర్సింహులు చౌదరిగూడకు డాక్టర్‌ను నియమించాలని జేడీని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్, హంసమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి



కడ్తాల్: మాట్లాడుతున్న తల్లోజు ఆచారి



కొత్తూర్: మహిళలతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎన్సీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం మైసిగండిలో మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహంపై చర్చించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, మాజీ ఎంపీపీ వీరయ్య, మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, బీజేవైఎం అధికార ప్రతినిధి భగీరత్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాన్యానాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాలే శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

సిద్దాపూర్‌లో గావ్‌చలో.. బస్తీ చలో

కొత్తూర్: మండల పరిధిలోని సిద్దాపూర్‌లో గురువారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు అత్తాపూరం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ అమడపురం నర్సింహగౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, భాస్కరాచారి, హరికృష్ణ, నరేందర్‌రెడ్డి, శ్రీధర్, మల్లారెడ్డి, కిరణ్, మంగలి రమేష్ పాల్గొన్నారు.

చౌదరిగూడ: గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని శివాలయ్యాన్ని శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంగన్వాడీ-1, అంగన్వాడీ -2 కేంద్రాలను సందర్శించారు. కేంద్ర పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించిన రూపను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు బోయ శంకర్, లక్ష్మయ్యగౌడ్, సత్యనారాయణ, శ్రీశైలం, కురుమయ్య, ప్రశాంత్, అర్జున్, యాదయ్య శేఖర్ పాల్గొన్నారు.